

ములకలచెరువు మండలం దేవళచెరువు సమీపంలో సాగుకు నోచుకోక బీడుగా ఉన్న భూములు

ప్రత్యామ్నాయమేదీ...!

- అదునులో వర్షాభావంతో భారీగా తగ్గిన వేరుశనగ సాగు
- ప్రత్నామ్నాయ పంటలపై రైతులు ఆసక్తి చూపినా ఫలితం శూన్యం
- వర్షాలు కురిసినా విత్తనాల పంపిణీపై నిర్లక్ష్యం
- ప్రతిపాదనలతో సరిపెట్టిన వ్యవసాయశాఖ
- ప్రత్యామ్నాయ సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూపు



ములకలచెరువు మండలం నీరుగట్టువారిపల్లె వద్ద ఉలవలు చల్లేందుకు ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న దృశ్యం

ములకలచెరువు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వేరుశనగ సాగు సమయంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అదునులో చినుకు రాలక సాగు విస్తీర్ణం లక్ష్యానికి చాలా దూరంలో నిలిచిపోయింది. ఎక్కడ చూసినా బీడు భూములే దర్శనమిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వేరుశనగ పంట సాగు భారీగా తగ్గిపోయింది. అన్నదాతలు ప్రత్యామ్నాయ పంటలపై ఆశలు పెట్టుకున్నారు. ఆగస్టు నెలలో వర్షాలు బాగా కురవడంతో ఉలవలు, కందులు, మొక్కజొన్న తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేద్దామని సమాయత్తం అయ్యారు. వ్యవసాయ శాఖాధికారులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రభుత్వం సబ్సిడీతో అందించనున్న విత్తనాల పంపిణీపై అయోమయం నెలకొంది. ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ విత్తనాల గురించి ఎలాంటి సమాచారం లేదు. ఇంతవరకు విత్తనాలు రానే లేదు. విత్తనాలు ఎప్పుడొస్తాయోనని రైతులు నిరీక్షిస్తున్నారు.

తంబళ్లపల్లె నియోజవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధారంలో వేరుశనగ పంట అత్యధికంగా సాగు చేస్తారు. విత్తనాలు విత్తే సమయంలో వరుణుడు ముఖం చాటేయడంతో రైతులకు నిరాశే మిగిలింది. జూన్ 15వ తేదీ నుంచి జూలై మొదటి వారం వరకు వేరుశనగకు అనువైన కాలం. ఈ సమయంలో వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ పంట సాగుకు నోచుకోలేదు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 13,850 ఎకరాల్లో వేరుశనగ పంట సాగవుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కేవలం 1500 హెక్టార్లలో మాత్రమే వేరుశనగ పంట సాగైంది. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేద్దామని అనుకున్నారు. ఆగస్టులో వర్షాలు కూడా భారీగా కురవడంతో ఉలవలు, కందులు, మొక్కజొన్న తదితర ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాల ఊసే లేకపోవడంతో రైతులు సాగుకు దూరంగా ఉండిపోతున్నారు. సబ్సిడీ విత్తనాలు ఇవ్వకపోతే బహిరంగ మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసేందుకు కొందరు రైతులు సిద్ధమవుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా సబ్సిడీ విత్తనాల పంపిణీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపాం



ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉలవ, కందులు తదితర విత్తనాలు అవసరమని ప్రతిపాదించాం. విత్తనాలు రాగానే పంపిణీ చేస్తాం. ఈనెలాఖరు వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా పంటల సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు తీసుకున్నాము.

- ప్రవంతి, వ్యవసాయ శాఖాధికారి, ములకలచెరువు

విత్తనాలు ఎప్పుడు ఇస్తారో



ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సబ్సిడీ విత్తనాలు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. ఒకటిన్నర ఎకరాలో ఉలవ పంట సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్నాను. ఆగస్టులో వాన బాగా పడింది. పొలాల్లో పదునైంది. భూమిలో తేమ శాతం బాగుంది. ఇప్పుడు ఉలవలు చల్లితే మంచి దిగుబడి వస్తాయి. ప్రభుత్వం సబ్సిడీతో ఉలవలు అందిస్తే సాగు చేస్తా. లేదంటే సాగుకు దూరంగా ఉంటాను.

- సిద్దారెడ్డి, వసంతరాయునిపల్లె, ములకలచెరువు మండలం

ఉలవ పంట సాగుకు దుక్కులు దున్నిస్తున్నా



ప్రతి ఏటా ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసేవాడిని. ఈ ఏడాది అదునులో వర్షం కురవక వేరుశనగ సాగు చేయలేకపోయా. ఇప్పుడు వర్షాలు కురవడంతో ఉలవ పంట సాగు చేద్దామని ఐదు ఎకరాలను ట్రాక్టర్‌తో దుక్కులు దున్నిస్తున్నా. ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం పంపిణీ చేయకపోతే బయట కొనుగోలు చేసి సాగు చేస్తాను.

- రమణయ్య, నీరుగట్టువారిపల్లె, ములకలచెరువు మండలం

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె సమీపంలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసరును తాగి ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి పౌర్ణమి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం నయనానందకరంగా జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్, వీణరాఘవాచార్యులు, మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. పూజల అనంతరం జీలకర్ర బెల్లం పెట్టి అనంతరం మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో పలు ఆలయాల మూసివేత





మూసివేసిన కోదండరామాలయం, వీరభద్రాలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

ఒంటి మిట్ట/రాయచోటి టౌన్/నందలూరు/తంబళ్లపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని టీటీడీ అధికారులు మూసివేశారు. చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఆలయాన్ని మూసివేశారు. తిరిగి ఆలయాన్ని సోమవారం ఉదయం 5 గంటలకు తెరుస్తారని అర్చకులు వీణారాఘవాచార్యులు తెలిపారు. 5 గంటలకు ఆలయాన్ని తెరిచి శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి 6 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

వీరభద్రాలయం...

రాయచోటి పట్టణంలో దక్షిణకాశీగా పిలవబడుతున్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని మూసివేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల ఆలయ ముఖద్వారం తలుపులను మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేశారు. సోమవారం ఉదయం 5 గంటలకు శుద్ధి చేసిన అనంతరం స్వామి వారికి నిత్యాభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

తంబళ్లపల్లెలో...

చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం తంబళ్లపల్లె మల్లయ్యకొండపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం, కోసువారిపల్లెలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ప్రధాన ఆలయాలతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలను అర్చకులు మూసివేశారు. తిరిగి ఆలయాలను సోమవారం తెల్లవారుజామున ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం యధావిధిగా భక్తులను అనుమతించి పూజలు నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

సౌమ్యనాథస్వామి ఆలయం...

నందలూరులోని సౌమ్యనాథస్వామి ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ తెలిపారు.

ఆకాశంలో అద్భుతం

కడపలో కనువిందు చేసిన చంద్రగ్రహణం



ఇతర జిల్లాలకూ సేవల విస్తరణ

- టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్



ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్

మదనపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు సేవలు మరింత విస్తరించనున్నట్లు ఆ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్ ప్రకటించారు. ఇప్పటికే మదనపల్లె ప్రధాన కార్యాలయంతో పాటు ఎన్టీఆర్ సర్కిల్, పుంగనూరులో బ్రాంచి ఉండగా, త్వరలో చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో కూడా బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధాన కార్యాలయంలో ఆదివారం 101వ వార్షిక మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకులు, శాఖల విస్తరణకు ప్రతిపాదనలు పంపామని ఆర్‌బీఐ నుంచి త్వరలోనే అనుమతి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బ్యాంకు శత వార్షికోత్సవ సంబరాలను వచ్చేనెలలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి బ్యాంకు డిపాజిట్లు రూ.91.46 కోట్లు కాగా, సభ్యులకు రూ.64.88 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే సభ్యుల వాటా ధనం రూ.2.31 కోట్లు, బ్యాంకు వ్యాపార ధనం రూ.112.84 కోట్లుగా ఉన్నట్లు 2024-25 వార్షిక నివేదకలో చూపించారు. బ్యాంకుకు మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులైన గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం సదుపాయాలను ఆర్‌బీఐ కల్పించినట్లు చైర్మన్ వివరించారు. త్వరలోనే వీటిని బ్యాంకులో అమలు చేయనున్నట్లు బ్యాంకు సీఈవో పీవీ ప్రసాద్ తెలిపారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ భాస్కర్‌కుమార్, డైరెక్టర్లు ఎస్.రవీంద్రనాథ్, ఎన్.ముక్తియార్‌ఖాన్, ఆర్.సోమశేఖర్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, ఆకుల కృష్ణమూర్తి, జోళపాలెం దేవేంద్ర, పి.సర్దార్‌ఖాన్, ఆర్.భాస్కర్, డి.నిరంజన్, కోటేశ్వరరావు, జె.గణపతి, విజయ్‌కుమార్, బ్యాంకు ఉద్యోగులు రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

మట్టి మాఫియా బరి తెగింపు



టిప్పర్‌తో మట్టిని తరలిస్తున్న దృశ్యం

- కొండలు...చెరువుల్లో అక్రమ తవ్వకాలు
- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు



నార్లపల్లె చెరువులో మట్టిని తవ్వుతున్న దృశ్యం

కురబలకోట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా బరి తెగిస్తోంది. ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించకుండా తమ లాభార్జన కోసం రాత్రింబవళ్లు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టిని భారీ స్థాయిలో దోచుకున్నారు. చెరువులో మట్టి తోలుకోవడానికి గత ప్రభుత్వ హయాంలో వైసీపీకి చెందిన ఒక ప్రజాప్రతినిధి రోజుకు రూ.25 వేలు తీసుకుని అనధికారకంగా మట్టి తోలుకోవడానికి అనుమతి ఇచ్చేవారని పలువురు ఆయనపై బహిరంగంగా ఆరోపణలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటికి అడ్డుకట్ట పడుతుందని అందరూ అనుకున్నారు. అయితే దానికి వ్యతిరేకంగా మట్టి మాఫియా మరింతగా రెచ్చిపోతోంది. అక్రమ మట్టి రవాణాను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. చింతమాకులపల్లె పంచాయతీలోని నార్లపల్లె చెరువులో రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్లతో మట్టిని లోడి టిప్పర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. అంగళ్లు సమీపంలోని కుందేలు గుట్ట, గుర్రాలవారిపల్లె, రంగమ్మ చెరువు, కురబలకోట సమీపంలోని ఊరగుట్ట, తెట్టు సమీపంలో గుట్టల నుంచి భారీగా మట్టిని తరలిస్తున్నారు. కాగా ఈ మట్టిని రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములకు, ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. కొంతమంది స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మట్టి మాఫియా యజమానులు రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినా రాజకీయ నేతలు జోక్యం చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మట్టి తరలింపును రెవెన్యూ అధికారులు అడ్డుకుని రెండు ఎక్స్‌కవేటర్లు, 7 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ ఘటన ముగిసిన కొన్ని నెలలకు మళ్లీ మట్టి తరలింపు జరుగుతోంది. ఈ విషయమై తహసీల్దార్ ధనంజయను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఎవరైనా మట్టిని అక్రమంగా తరలిస్తే తమకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత లేదు

- తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు
- డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్ స్పష్టం చేశారు. ఆదివారం కోడూరు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు యూరియాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రైతులు ఆందోళన చెందవద్దని జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. యూరియాపై తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఎన్నడూ లేని విధం గా కడప జిల్లాకు 20 వేల 500 మెట్రిక్ టన్నులు, డీఏపీ ఎరువులు 70 వేల టన్నులు కేటాయించిందని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు కూడా 16 వేల మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో రైతులకు 50 శాతం వర కు యూరియా పంపి ణీ చేసినట్లు తెలిపారు. వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం, రైతుల్లో గందరగోళం సృష్టించాలనే ఉద్దేశంతోనే యూరి యా కొరత ఉందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల టీడీ పీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, గిరినాయుడు, యేసోబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ఖాదర్ హుసేన్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగి కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్‌హుసేన్(53) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్ హుసేన్ డీసీసీ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పనిమీద కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక కడప-కర్నూల్ జాతీయ రహదారిలో మైదుకూరు బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా స్కార్పియో ఢీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ బ్రాందీషాపు ఎదురుగా శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఏపీ39ఏజెడ్8379 స్కార్పియో వాహనం ముద్దనూరు వైపు నుంచి బయల్దేరింది. మద్యం షాపు ఎదురుగా అందులో పనిచేస్తున్న గుమస్తా గురుసాయినందన్ అనే యువకుడు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన స్కార్పియో ఢీకొంది. ఈ ఘటనలో యువకుడికి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

నవ వధువు అనుమానాస్పద మృతి


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దారు, ఎస్ఐ

చిట్వేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 9నెలల క్రితం ఏడడుగులు నడిచిన నవ వధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చిట్వేలి మండలంలో చోటు చేసుకుంది. ఎస్టీ కాలనీకి చెందిన దాసరి ప్రశాంతి(25) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం ఉదయం చిట్వేలి పోలీసులకు ఫిర్యాదు అందింది. నెల్లూరు టౌను గిరిజన కాలనీకి చెందిన ప్రశాంతిని అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నేతివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన రాజేష్‌తో 9 నెలల క్రితం వివాహమైంది. తర్వాత కొంతకాలం నుంచి కుటుంబంలో కలహాలు రావడంతో అత్తారింటి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ప్రశాంతి ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతురాలి తండ్రి దాసరి రమేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టపాసులు పేలి ఇరువురికి గాయాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం దిగువ ఇందుకూరుపల్లిలో జరిగిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో టపాసులు పేలుస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న శివవంకర్, మనోజ్ అనే ఇద్దరు యువకుల కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు హుటాహుటిన గ్రామానికి చేరుకొని అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని అంబులెన్స్‌లో రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుగవాసి ప్రసాద్‌బాబు బాధితులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన ఇల్లు


కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో నివాసం ఉంటున్న కంచర్ల ఆంజనేయులు ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన ఇంట్లోని వస్తువులన్ని కాలిబూడిద అయ్యాయి. ఆంజనేయులు ప్రొద్దుటూరు రోడ్డులో ల్యాండ్రీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కూడా ల్యాండ్రీ షాపు వద్ద పనులు చేసుకొంటుండగా ఉన్నట్లుండి ఇంట్లో మంటలు, పొగలు రావడంతో ఇంటి పక్కన వారు ఆంజనేయులుకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఇళ్లంతా కాలిబూడిదయిందని వాపోయాడు. ఆంజనేయులు కుటుంబం కట్టు బట్టలతో మిగిలారు. ప్రభుత్వం నుంచి సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శనివారం పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ చిరంజీవి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేయగా, మరి కొంతమంది తప్పించుకొని పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1.57 లక్షలను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దవటం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాజంపేట గ్రామ సమీపంలో శనివారం రాత్రి వంతాటిపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద 65 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.10 వేలు ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు చోరీ

బి.కోడూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలు దోచుకెళ్తున్నారు. శనివారం రాత్రి ఆ గ్రామానికి చెందిన రైతులు రమణయ్య, లక్కిరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలించారు. మండలంలో అన్ని గ్రామాలు ఒక ఎత్తయితే, పాయలకుంట్ల గ్రామం దొంగలకు టార్గెట్‌గా మారింది. ఎక్కువగా ఆ గ్రామం ఇళ్లల్లో చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల రైతు ఇంటి వద్ద ఉన్న ఆవును దొంగలు ఆటోలో తీసుకెళ్లారు. అంతేకాక అదే గ్రామంలో నాలుగు గుళ్లల్లో హుండీ దొంగతనం జరిగింది. ఇప్పటికే దాదాపు 20 ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ గ్రామంపైన పోలీసు అధికారులు గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుంటే తప్ప మరిన్ని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలానికి నీళ్లు కట్టుకునేందుకు వీలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, అందులోని రాగివైర్లు, మోటర్ల వద్ద ఉన్న రాగి కేబుల్, స్టాటర్లను దొంగలు ఎత్తుకెళ్లుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు దొంగలను పట్టుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం



అరుణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. విధుల్లో భాగంగా రోజులో ఎక్కువ సేపు కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్‌పై పనిచేస్తుంటాడు. దీంతో అతని మెడ, వెన్నులో నొప్పి మొదలైంది. ఆసుపత్రికెళితే మందులిచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. కానీ ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందగలిగాడు.

రామారావుకు 50సంవత్సరాలు. ఈ మధ్య మోకాళ్ల నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం మోకాళ్లు యథాస్థానానికి, కీళ్ల కదలికలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడింది.

మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాలతో అనేకమంది యువత, పెద్దలు కీళ్లనొప్పులు, వెన్నునొప్పి, మెడనొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు మందులు లేకుండా ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించి, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫిజియోథెరపిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.



నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా జరుపుకొంటారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం.


సర్వజన ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనంలో ఫిజియోథెరపీ అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. పుట్టుకతో వచ్చే వైకల్యాలు, ప్రమాదాల వల్ల కలిగే గాయాలు, పక్షవాతం, మానసిక ఒత్తిడి వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఫిజియోథెరపీ అద్భుతమైన చికిత్సగా నిలుస్తోంది. వ్యాయామాల ద్వారా, చేతితో చేసే చికిత్సల ద్వారా శారీరక కదలికలను మెరుగుపరిచి, నొప్పిని తగ్గించి, జీవిత నాణ్యతను పెంచడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తోంది.

పీడియాట్రిక్ ఫిజియోథెరపీ

పిల్లల భవిష్యత్తు కోసం పిల్లల ఆరోగ్యానికి పీడియాట్రిక్ ఫిజియోథెరపీ ఎంతో అవసరం. పుట్టినప్పటి నుంచి వచ్చే కండరాల బలహీనత, శరీర భాగాల కదలికలో సమస్యలు, మెదడు పక్షవాతం వంటి సమస్యలకు ఈ చికిత్స చాలా ఉపయోగపడుతుంది. ఫిజియోథెరపిస్టులు వ్యాయామాల ద్వారా పిల్లలు సాధారణ జీవితం గడపడానికి, స్కూల్‌కు వెళ్లడానికి, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి ఈ చికిత్స దోహదపడుతుంది.

ఫిజియోథెరపీలో మహిళలకు..

గర్భధారణ, ప్రసవం, రుతుక్రమం వంటి సందర్భాల్లో మహిళలు ఎదుర్కొనే శారీరక సమస్యలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు ఈ చికిత్సను ఉపయోగించుకోవడం లేదు. ఫిజియోథెరపీ ద్వారా ఈ సమస్యలను అధిగమించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు. వైద్యులు, ఫిజియోథెరపీ నిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఫిజియోథెరపీ చికిత్సను స్వీకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో..

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఫిజియోథెరపీ విభాగంలో ప్రతిరోజు సుమారు 70 నుంచి 80 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఫిజియోథెరపీ సంబంధంగా పీడియాట్రిక్స్, జెరియాట్రిక్స్, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్సైజ్‌థెరపీ పరికరాలతో విద్యార్థులు, ట్రైనీ డాక్టర్లతో పక్షవాతం, కీళ్లనొప్పులు, పోస్ట్ ఆప్, ఆర్థో సర్జరీస్‌లకు, ఎముకలు, నరాల సంబంధ మరెన్నో వ్యాధులకు ఇక్కడి ఫిజియోథెరపీ విభాగంలో చికిత్స పొందుతున్నారు.

అన్ని వసతులతో అందుబాటులోకి..



ప్రజలు ఇక్కడ ప్రత్యేకంగా ఆర్థో, న్యూరో, కార్డియో, పీడియాట్రిక్స్ సర్జరీస్ భాగాలకు, తదితర విభాగాలకు ఫిజియోథెరపీ చికిత్స చేయడం జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేకంగా నూతన లేజర్, యూఆర్ థెరపీ ద్వారా పిల్లల నుంచి పెద్దల వరకు చికిత్స ఇవ్వడం జరుగుతుంది. ఇక్కడ ముగ్గురు ఫిజియోథెరపిస్టులు, 30 మంది ఇంటర్న్‌ల ద్వారా చికిత్సలు అందిస్తున్నారు. నూతన పరికరాలతో, ప్రక్రియలతో ఫిజియోథెరపీలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అన్ని వసతులతో ఫిజియోథెరపీ విభాగం అందుబాటులో ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ సంపత్, ఫిజియోథెరపీ విభాగం హెచ్‌వోడీ, కడప సర్వజన ఆసుపత్రి

అన్నమయ్య జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



- విద్య, వైద్య, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- ఆంధ్రజ్యోతితో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

రాజంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఉమ్మడి కడప జిల్లా ఉందని, దేశవ్యాప్తంగా 112 జిల్లాలు వెనుకబడి ఉండగా ఉమ్మడి కడప జిల్లాలోని అన్నమయ్య జిల్లా అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని, దీనిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం రాజంపేటలో ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అడిగిన కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన తమ శాఖ విధానాలను వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అభివృద్ధిపరంగా వెనుకబడి ఉన్న 112 జిల్లాలను గుర్తించిందని, వీటిలో ఉమ్మడి కడప జిల్లా ఉండగా అందులో అత్యంత వెనుకబడిన స్థితిలో అన్నమయ్య జిల్లా ఉందని, వీటిని కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాల జాబితాలో గుర్తించి ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సమన్వయపరుస్తూ ఆ పథకాలు పూర్తిగా అమలయ్యేటట్లు వాటి ఫలితాలు ప్రజలకు చేరువయ్యేటట్లు అటు సంక్షేమాన్ని ఇటు అభివృద్ధిని ప్రజలకు చేరవేసి అభివృద్ధి పరచడమే తమ 20 సూత్రాల అమలు కమిటీ బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా తాము ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల పనితీరుపై పూర్తిస్థాయిలో సమీక్షలు చేశామని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో రెండుసార్లు పర్యటించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాల గురించి అధ్యయనం చేశామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో గత వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. ఏ శాఖ అధికారిని ఆ శాఖ పనిని చేయనివ్వకుండా నిధులను వారికి ఇష్టమొచ్చినట్లు మళ్లించి భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయిందన్నారు. అన్ని శాఖలు నిర్వీర్యమై అధికారులు నామమాత్రంగా తయారయ్యారన్నారు. విషయాన్ని తాము గుర్తెరిగి అన్నిశాఖల అధికారులను సమన్వయపరిచి తిరిగి వాటిని గాడిన పెడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో భారీ ఎత్తున భూఆక్రమణలు జరిగాయని, రికార్డులు తారుమారు చేశారని దీనిపై శాఖాపరంగా చర్యలు తీసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో పోషకాహారం సక్రమంగా అందని ప్రాంతాలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు ఆ ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలు అనేకం గుర్తించామని, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా వారికి ఇబ్బందులు లేకుండా చేయడానికి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఇటీవల అత్యంత వెనుకబడ్డ 500 బ్లాకులను గుర్తించామని, ఆ బ్లాకుల్లో ఉమ్మడి కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ప్రాంతాలు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజంపేట ప్రాంతంలో కూడా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తాము ప్రత్యేక నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ పథకం కింద అన్నమయ్య జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఒకేచోట చదివే సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య, విద్య, పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిపై తిరుపతిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించి పథకాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఒంటిమిట్ట, గండికోట ప్రాంతాలను ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం చేస్తామని, ఒంటిమిట్ట ఆలయానికి అనుసంధానంగా దేవునికడప, భద్రాచలం, తిరుమల, శ్రీశైలం, చుట్టుపక్కల ఆలయాన్ని అనుసందానం చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ విజేత కడప జిల్లా జట్టు


ట్రోఫీ అందుకున్న కడప జిల్లా జట్టు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ పోటీ విజేతగా కడపజిల్లా జట్టు అవతరించింది. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు 11జట్లు హాజరయ్యాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడపజట్టు విజేతగా నిలువగా ఎన్టీఆర్‌జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీతోపాటు మెడల్స్‌ను అందజేశారు. యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివారెడ్డి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.

సమాజానికి సంపద సృష్టించి సేవలందించండి


సమావేశంలో పాల్గొన్న సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్ ఆర్గనైజేషన్‌కు చెందిన 45మంది యువ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఇందులో కడప జిల్లాకు చెందిన సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి, డాక్టర్ సింగారెడ్డి దివిజ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, యువ పారిశ్రామికవేత్తలు కొత్త రంగాల్లో అడుగుపెట్టి సత్తా చాటాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, వివిధ ప్రాంతాల యువ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక


జిల్లా స్థాయి జూనియర్ బాలికల జట్టుకు ఎంపికైన వారు

జమ్మలమడుగు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైఎస్ఆర్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, వెంకటరమణ హాజరై పూర్తి చేశారు. ఈ ఎంపికలకు అన్ని మండలాల నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా బచ్చులపల్లి మండలం రామాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సెలెక్షన్ కన్వీనర్ ఓబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సెలక్షన్ కమిటీ మెంబర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు..: కె.కౌశిక్, ఎస్.మహమ్మద్‌బాబా (రాజంపేట), జె.హైడెన్, డి.రాజేష్, ఎస్.వెంకటేష్, ఎం.చిన్న ఓబులేసు (దూవ్వూరు), డి.షద్రక్, డి.రఫేల్ (చిన్నగంగన్నపల్లె), ఎస్.మురళీరాజు (ఒంటిమిట్ట), ఎస్.షాజిద్ (రాజంపేట)

జిల్లా బాలికల జట్టు..: డి.కీర్తి, డి.నయోమి (చిన్నగంగన్నపల్లె), ఎం.స్వీటీ (ఎస్.ఉప్పలపాడు), జి.వర్షిణి (తాళ్లప్రొద్దుటూరు), ఎం.గౌతమి, జి.సునంద, కె.చర్లిన్, ఎస్.అశ్విని, ఎస్.లక్ష్మి (చియ్యపాడు)

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి

చిట్వేలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేకే వడ్డిపల్లెకి చెందిన రాయని శాంతమ్మ(34) ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. శాంతమ్మ మరి కొంతమందితో కలసి కూలీపనుల నిమిత్తం ట్రాక్టర్‌లో ఎగువపల్లికి వెళ్లింది. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా కె.కందులవారిపల్లె గ్రామంలోకి వచ్చేసరికి అతివేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను స్పీడ్ బ్రేకర్ వచ్చిందని డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న శాంతమ్మ ట్రాలీకి, ఇంజన్‌కు మధ్యలో పడటంతో ఆమెపై ట్రాలీ ఎక్కింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు కూలీలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి మరిది సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేటకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అత్తపై అల్లుడు దాడి

నందలూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ మరాటపల్లె గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. నరసింహారావు అలియాస్ చిన్న భార్య మంజులాబాయి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలకు వెళ్లింది. ఈక్రమంలో వారి ఇద్దరి పిల్లలను తల్లి పద్మావతిబాయి వద్ద ఉంచింది. ఆదివారం పిల్లలను తనతో పంపాలని అత్తతో గొడవకు దిగిన చిన్న కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెనుకంజలో చిత్తూరు, నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో మొదటి రోజైన ఆదివారం ప్రత్యర్థి జట్ల కన్నా చిత్తూరు, నెల్లూరు జట్లు వెనుకంజలో ఎదురీదుతున్నాయి.

ఏసీఏ మైదానంలో..: నగర రిమ్స్ సమీపంలో ఉన్న వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..: నగర శివారు ప్రాంత కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు 43.5 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది.

నారా లోకేశ్‌తో మార్కెట్‌యార్డు చైర్మన్ భేటీ


నారా లోకేశ్‌తో సుబ్బనరసయ్యనాయుడు

రాజంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్యనాయుడు ఆదివారం విజయవాడలో భేటీ అయ్యారు. తనను రాజంపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజంపేట మార్కెట్ అభివృద్ధికి తమ శక్తివంచన లేకుండా కృషి చేయడంతో పాటు, రైతాంగానికి అందుబాటులో ఉంటానని తెలిపినట్లు వివరించారు.

16 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లి లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 16 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మందికి పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 20 మందికి పరీక్షలు నిర్వహించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూప గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'బొప్పాయి రైతుల కోసం పోరాడితే బైండోవర్ చేశారు'

రైల్వేకోడూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతుల కోసం పోరాటాలు చేస్తే అధికారులు తనను బైండోవర్ చేశారని ఆదివారం జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళారులు బొప్పాయి ధరలు తగ్గించడంతో రైతుల పక్షాన పోరాటం చేసినందుకు ఏదో నేరం చేసినట్లు బైండోవర్ నమోదు చేశారని తెలిపారు. రైతుల పక్షాన నిలవడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు.

విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సబ్‌స్టేషన్‌లో పనిచేసే విద్యుత్‌శాఖ కార్మికులు రైతుల సమస్యలు పట్టించుకోలేదని చిన్నఓరంపాడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తమలపాకు తీగలు నాటే సమయం కావడంతో సక్రమంగా విద్యుత్ రాకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల సమస్యలు పట్టించుకోని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు..

వైభవంగా నిమజ్జనం


లడ్డును ఊరేగింపుగా తీసుకెళుతున్న మద్దిరేవుల రెడ్డిశేఖర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని బ్యాంకు బజార్‌లో ఉన్న వినాయకుడిని ఆదివారం నిమజ్జనం చేశారు. కోలాటాలు, చెక్కభజనల మధ్య ఊరేగించి స్థానిక దొర్రి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొండూరు వెంకట్రామరాజు, వినాయక యూత్ నాయకులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణంలోని రెడ్డీస్ కాలనీ అగ్రగామినే గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద శనివారం రాత్రి లడ్డు వేలం నిర్వహించగా, రూ. 1.93 లక్షలకు మద్దిరేవుల రెడ్డిశేఖర్‌రెడ్డి దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో అగ్ర గామినే గణేశ్ ఉత్సవ కమిటీ చెర్మన్ మదన్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. తారు వేయడం మరిచారు

- ప్రమాదకరంగా కాలాడివాండ్లపల్లె రోడ్డు
- ఎనిమిదేళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కాలాడి వాండ్లపల్లెకు వెళ్లే కంకర రోడ్డు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అర్ధాంతరంగా రోడ్డు పనులు ఆగిపోవడంతో ఎనిమిదేళ్లగా కాలాడివాండ్లపల్లె వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర పరిచిన అనంతరం పనులు ఆపివేయడంతో ఆ మార్గంలో ప్రయాణించేందుకు ద్విచక్రవాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట పంచాయతీలోని అప్పకొండయ్యగారి పల్లె - కాలాడివాండ్లపల్లె గ్రామాలకు తారు రోడ్డు ఏర్పాటుకు. 2018లో రూ. 80 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 2019 వరకు పనులు ముమ్మరంగా సాగాయి. దీంతో కొనసారివారిపల్లె, యర్రప్పగారిపల్లె, దిన్నెపాడు, బీ. యర్రగుడి గ్రామాల ప్రజలు సంతోషపడ్డారు. అయితే, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ రోడ్డు పనులు నిలిచి పోయాయి. బిల్లులు కూడా అందకపోవడంతో కాంట్రాక్టరు పట్టించుకో లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇంతవరకు కాలాడివాండ్లపల్లె రోడ్డు ను నాయకులుగానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులకు విన్నవించుకున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కస్తూరిరాజుగారిపల్లె నుంచి ఆర్‌వీ రోడ్డుకు వెళ్లే రోడ్డు గుంతలమయమైనా పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్లపైన ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాల నుంచి కాపాడాలని పంచాయతీరాజ్ అధికారులను కోరుతున్నామని ప్రజలు అంటున్నారు.

ప్రమాదానికి గురికావాల్సిందే



ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణిస్తే కచ్చితంగా ప్రమాదం జరుగుతుండడంతో ప్రాణాలు అచేతిలో పెట్టుకొని వెళుతున్నాం. పనులు ఆగిపోయి ఎనిమిదేళ్లవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా కాలాడివాండ్లపల్లె రోడు పనులు పూర్తి చేయాలి.

- రాజారెడ్డి, కొనసానివారిపల్లె

రోడ్డు పనులు పూర్తి చేయండి



కాలాడివారిపల్లె రోడ్డు పనులు పూర్తి చేయాలి. పగలు, రాత్రి తేడా లేకుండా ఈ దారిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళుతూ ఉంటాయి. కంకర రోడ్డు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- కాలాడి సుధాకర్‌రెడ్డి

ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సాంబశివ

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఆటో డ్రైవర్ల సంఘం పట్టణ కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటిలో ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న ఆటో డ్రైవర్లు ప్రభుత్వం అమలు చేసిన స్త్రీశక్తి పథకంలో మరింత నష్టపోతున్నామని తెలిపారు. భారత న్యాయ సంహిత 2023లో డ్రైవర్లను జైలుపాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ చట్టంలో సెక్షన్ 106 1, 2 చట్టాలు డ్రైవర్లకు రూ.10 లక్షల వరకు జరిమానా, జీవిత ఖైదు విధించాలని చెబుతుందన్నారు. ఆటో, క్యాబ్, టాటా ఏస్ డ్రైవర్లు, కార్మికుల కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ. 25 వేలు చొప్పున చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టంలోని ప్రమాదకర సెక్షన్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలకు ఎఫ్‌సీ సేవలు మదనపల్లి ఆర్‌టీవో కార్యాలయంలోనే కొనసాగించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెనాల్టీలు పెంచే నోటిఫికేషన్ జీవో నెంబర్ 21 31 రద్దు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరమైన కూడలిలో ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 16న ఆటో డ్రైవర్ల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు హైదర్‌వలి, బాబ్జీ, రియాజ్, శివయ్య, చాంద్‌బాషా, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే హక్కుల సాధన

- వడ్డెరల చైతన్య సదస్సులో న్యాయవాది ఈశ్వర్


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది ఈశ్వర్

రాయచోటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం, చట్టాలపైన అవగాహన ఉన్నప్పుడే అణగారిన వర్గాలవారు హక్కులను సాధించుకోగలరని భారత న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలో నిర్వహించిన ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండరాళ్లను పిండి చేసి, నిర్మాణాలు చేసే వడ్డెరలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారన్నారు. రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది వడ్డెరలు ఉన్నారని, స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వడ్డెరల బతుకుల్లో మాత్రం మార్పు రాలేదన్నారు. పెమ్మాడపల్లి సర్పంచ్ పల్లపు వాసు మాట్లాడుతూ వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించినప్పుడే అభివృద్ధిలోకి వస్తారన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, రమణయ్య, జీవా నందం, న్యాయవాదులు నాగముని, నాగార్జున, బీజేపీ శివప్రసాద్, వీరభద్రస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు కోటకొండ రవిశంకర్, వేదిక ఉపాధ్యక్షుడు చల్లా రెడ్డెయ్య, బీవీ రమణ, రామకృష్ణ, చిన్నప్ప, రాంప్రసాద్, రామచంద్రయ్య, ఆంజనేయులు, నాలుగు మండలాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుంపిణీపురం గ్రామాభివృద్ధికి కృషి : చమర్తి


చమర్తి జగన్‌మోహన్‌రాజును స్వాగతిస్తున్న గ్రామస్థులు

నందలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుంపిణీపురం గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని, గ్రామ ప్రజ లకు అండగా ఉంటానని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మో హన్‌రాజు హామీ ఇచ్చారు. ఆదివారం కుంపిణీపురం గ్రా మస్తులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కుంపిణీపురం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యెద్దల సుబ్బరాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ నాయకులు పసుపులేటి ప్రవీణ్‌కుమార్, అమ్మినేని విజయ్, పోలి శివకుమార్, గణపతి, తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశంపార్టీ నాయకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

రాజంపేట టౌన్ : మేదర సంఘానికి అన్నివిధాల చేయూతనిచ్చేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమన్ని చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు. పట్టణంలోని బీవీఎన్ పాఠశాలలో మేదరసంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘానికి ఎటువంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. మేదరల జీవన ప్రమాణాలు పెంపొందించడంతో పాటు సమాజంలో వారికి గౌరవ స్థానం కల్పించేందుకు అన్నివిధాల తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గ్రంధి రామోజీ, జిల్లా అధ్యక్షుడు కోలే నరసింహారావు, రాష్ట్ర సభ్యుడు శ్రీహరి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు ఆర్ల ఈశ్వరమ్మ, పోలేపల్లె నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

కడపాయపల్లె పంచాయతీకి గ్రామ కార్యదర్శిని నియమించండి

సిద్దవటం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన బదిలీపై వెళ్లి నెల రోజులు కావస్తున్నా.. ఆ స్థానాన్ని భర్తీ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండలంలోని కడపాయపల్లెవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శి లేకపోవడంతో మరణ ధ్రువీకరణపత్రం ఇచ్చే దిక్కు కూడా లేకుండా పోయిందని అంటున్నారు. దీనికి తోడు నిర్వహణ లేక పారిశుధ్యం అధ్వానంగా మారిందంటున్నారు. విద్యుత్ దీపాలు, తాగునీటి సమస్యలు పరిష్కారం కావాలంటే సెక్రటరీని తక్షణమే నియమించాలని గ్రామస్థులు కోరుతు న్నారు. ఈ విషయమై కడప డీఎల్పీవో విజయభాస్కర్ మాట్లాడుతూ డెప్యుటేషన్‌పై పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవోకు సూచిస్తామన్నారు.

వైసీపీ దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల సూపర్ హిట్ తో దిక్కుతోచక వైసీపీ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంపై ఆంబోతులాపడి దోచుకున్న అంబటి రాంబాబు ఫ్రస్ట్రేషన్‌లో నారా లోకేశ్‌బాబుపై నోరు పారేసుకుంటున్నాడన్నారు. ప్రభుత్వంపై విషం చిమ్మడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. ఉల్లి రైతులను ఆదుకోవడం లేదంటూ వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఖాళీ పురుగుమందు డబ్బాలో మద్యం పోసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నామంటూ సెల్ఫీ వీడియోలు విడుదల చేయడం వారి నీచమైన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సెప్టెంబరు 10న అనంతపురం జిల్లాలో నిర్వహించనున్న సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభకు వెళ్లేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, రోషా తదితరులు పాల్గొన్నారు.

మంగంపేటలో వైద్యశిబిరం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట గ్రామంలో యువ నాయకుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతికి చెందిన నారాయణాద్రి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు ఈ కార్యక్రమానికి లావులూరి ప్రభాకర్, గల్లా శ్రీనివాసులు, శ్రీను, సుబ్రమణ్యం, వెంకటేష్‌ల సహకారం అందించారు.

కోదండరాముడి సన్నిధిలో 20 సూత్రాల కమిటీ చైర్మన్


కోదండరాముని సన్నిధిలో లంకా దినకర్, సాయిలోకేశ్

ఒంటిమిట్ట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయాన్ని ఆదివారం ఉదయం 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ సందర్శించారు. అర్చకుడు శ్రావణ్ కుమార్ ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర వివరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్, మండల బీజేపీ అధ్యక్షుడు భాను ప్రకాశ్ రాజు, చెరువు సంఘం అధ్యక్షుడు పాటూరు గంగి రెడ్డి, మాజీ అధ్యక్షుడు శివ రాజు, ప్రధాన కార్యదర్శి జగ దీశ్ కుమార్, నరసింహ, కొం డయ్య, చిన్నపు రవి, ప్రతాప్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సులభతర వాణిజ్యంపై నేడు అవగాహన సదస్సు

రాయచోటి కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న సులభతర వాణిజ్య కార్యక్రమం (ఈవోడీబీ)లో భాగంగా సోమవారం కర్నూలులోని సోమశెట్టి తనీశ్ కన్వెన్షన్ హాలులో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణకిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పారిశ్రామివేత్త లందరూ తప్పక హాజరై వాణిజ్య సంస్కరణలను తెలుసుకోవడంతో పాటు, మీ విలువైన సూచనలు, అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా కోరారు.

టిప్పర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి


టిప్పర్ డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్

రామాపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గువ్వల చెరువులో టిప్పర్ డ్రైవర్ల సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రనక, పగలనక కుటుంబాలను వదిలేసి దూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేస్తూ చాలీచాలని జీతాలతో టిప్పర్ డ్రైవర్లు నానా అవస్థలు పడు తున్నారన్నారు. వెంటనే వారికి జీతాలు పెంచి పనికి తగ్గ బత్తాలు ఇవ్వా లని డిమాండ్ చేశారు. అనంతరం రామాపురం మండల కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. టిప్పర్ డ్రైవర్ల మండల కమిటీ గౌరవాధ్యక్షుడుగా మావులూరి విశ్వనాధ్, అధ్యక్షుడుగా వెంకట్రమణ, కార్యదర్శిగా మనోహర్, ఉపాధ్యక్షుడుగా సెల్వనిత్యపూజ, కోశాధికారిగా శశికుమార్, సహాయ కార్య దర్శిగా రామకృష్ణ, కమిటీ సభ్యులుగా ఓబులేసు, చంద్రశేఖర్, రామకృష్ణ, మహేశ్, మహేంద్రను ఎన్నుకున్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీ


విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న మత పెద్దలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి):జమియతే ఇత్తెహాదుల్ హింద్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనపర్చిన ముస్లిం విద్యార్థులకు జల్సా అల్ ఇండియా జమియతే ఉల్మా హింద్ జనరల్ సెక్రటరీ ముఫ్తీ మాసూమ్‌సాబ్ నగదు బహుమతి ప్రదానం చేశారు. ఇందులో మొదటి బహుమతి షేక్. కలీము ల్లాహాకు రూ.10 వేలు, రెండవ బహుమతి షేక్. మహమ్మద్‌గౌస్‌కి రూ.5 వేలు, మూడవ బహుమతి షేక్. అలీఇష్రా సుల్తానాకు రూ.3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్ర, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత


మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసేస్తున్న సిబ్బంది

రైల్వేకోడూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్ర గ్రహణం సందర్భంగా స్థానిక భుజంగేశ్వర స్వామి, అయ్యప్ప, వెంకటేశ్వర, ఆంజనేయ, భ్రమరాంబికా మల్లికార్జునస్వామి తదితర ఆల యాలను ఆదివారం మూసివేశారు. రాత్రి 9.50 గంటల నుంచి చంద్ర గ్రహణం రానుండడంతో మధ్యాహ్నం నుంచే ఆలయాలను మూసివేసినట్లు అర్చకుడు బోయలకుంట్ల పవన్‌కుమార్ శర్మ తెలిపారు. తెల్లవారుజామున ఆలయాలను శుద్ధి చేసి పూజలు నిర్వహించనున్నామని వివరించారు.

చిన్నమండెం: చంద్రగ్రహణం సందర్భంగా మాండవ్యనది ఒడ్డున ఉన్న మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసివేసివేసినట్లు పూజారులు తెలిపారు. సోమవారం పూజల అనంతరం స్వామివారు ప్రజలకు దర్శనమిస్తారని వారు వివరించారు.

రోగులపై ఆసుపత్రి సిబ్బంది చిందులు

సిద్దవటం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం ప్రభుత్వ దవాఖానాలో ఆది వారం ఓపీ రాసేందుకు కూ డా దిక్కులేకుండా పోయింది. పైగా సిబ్బంది చిందులు వేయడంతో రోగులు మహిళా డాక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలో వైరల్ జ్వరాలు పెరిగిపోయాయి. దీంతో ప్రతి రోజూ సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రికి 250 మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. అయితే, ఆదివారం ఆసుపత్రికి వచ్చిన రోగులతో సిబ్బంది విచక్షణ కోల్పోయి ఆసుపత్రికి మాట్లాడటంపై అసహనం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

మహిళా సాధికారత కోసం నిరంతర పోరాటం


మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, సమానత్వం కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సరోజమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. గంటకు ఒక వరకట్నం హత్య జరుగుతోందని, 80 శాతం మంది మహిళలు భర్త చేతుల్లో హింసకు గురవుతున్నారన్నారు. అంతర్జాతీయ లింగ సమానత్వ సూచిక ప్రకారం భారతదేశంలో 108/193 ఉందన్నారు. ఇలాంటి తరుణంలో మహిళలు హక్కుల రక్షణ కోసం రక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా సీపీఐ కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ ప్రజల జీవితాన్ని నాశనం చేస్తున్న ఈ మద్యాన్ని పూర్తిగా నిషేధించి, మహిళలకు రక్షణ కల్పించేంతవరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి సిద్దిగాల్ల శ్రీనివాసులు, నాయకురాలు లక్ష్మీదేవి, రత్నమ్మ, ప్రమీల, పద్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ఖాదర్ హుసేన్

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగి కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్‌హుసేన్(53) అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలసపాడుకు చెందిన షేక్ ఖాదర్ హుసేన్ డీసీసీ బ్యాంకులో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం పనిమీద కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక కడప-కర్నూల్ జాతీయ రహదారిలో మైదుకూరు బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు దాటుతుండగా స్కార్పియో ఢీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ బ్రాందీషాపు ఎదురుగా శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఏపీ39ఏజెడ్8379 స్కార్పియో వాహనం ముద్దనూరు వైపు నుంచి బయల్దేరింది. మద్యం షాపు ఎదురుగా అందులో పనిచేస్తున్న గుమస్తా గురుసాయినందన్ అనే యువకుడు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన స్కార్పియో ఢీకొంది. ఈ ఘటనలో యువకుడికి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

నవ వధువు అనుమానాస్పద మృతి


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దారు, ఎస్ఐ

చిట్వేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 9నెలల క్రితం ఏడడుగులు నడిచిన నవ వధువు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చిట్వేలి మండలంలో చోటు చేసుకుంది. ఎస్టీ కాలనీకి చెందిన దాసరి ప్రశాంతి(25) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం ఉదయం చిట్వేలి పోలీసులకు ఫిర్యాదు అందింది. నెల్లూరు టౌను గిరిజన కాలనీకి చెందిన ప్రశాంతిని అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం నేతివారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన రాజేష్‌తో 9 నెలల క్రితం వివాహమైంది. తర్వాత కొంతకాలం నుంచి కుటుంబంలో కలహాలు రావడంతో అత్తారింటి వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన ప్రశాంతి ఉరి వేసుకుని మృతి చెందినట్లు మృతురాలి తండ్రి దాసరి రమేశ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టపాసులు పేలి ఇరువురికి గాయాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం దిగువ ఇందుకూరుపల్లిలో జరిగిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో టపాసులు పేలుస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న శివశంకర్, మనోజ్ అనే ఇద్దరు యువకుల కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు హుటాహుటిన గ్రామానికి చేరుకొని అంబులెన్స్‌ను పిలిపించి గాయపడిన వారిని అంబులెన్స్‌లో రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుగవాసి ప్రసాద్‌బాబు బాధితులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● కాలిపోయిన ఇల్లు


కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో నివాసం ఉంటున్న కంచర్ల ఆంజనేయులు ఇంట్లో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వలన ఇంట్లోని వస్తువులన్ని కాలిబూడిద అయ్యాయి. ఆంజనేయులు ప్రొద్దుటూరు రోడ్డులో ల్యాండ్రీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కూడా ల్యాండ్రీ షాపు వద్ద పనులు చేసుకొం టుండగా ఉన్నట్లుండి ఇంట్లో మంటలు, పొగలు రావడంతో ఇంటి పక్కన వారు ఆంజనేయులుకు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఇళ్లంతా కాలిబూడిదయిందని వాపోయాడు. ఆంజనేయులు కుటుంబం కట్టు బట్టలతో మిగిలారు. ప్రభుత్వం నుంచి సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో శనివారం పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించిన ఎస్ఐ చిరంజీవి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేయగా, మరి కొంతమంది తప్పించుకొని పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1.57 లక్షలను స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ తెలిపారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సిద్దవటం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాజంపేట గ్రామ సమీపంలో శనివారం రాత్రి వంతాటిపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద 65 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.10 వేలు ఉంటుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రాగి వైరు చోరీ

బి.కోడూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలు దోచుకెళ్తున్నారు. శనివారం రాత్రి ఆ గ్రామానికి చెందిన రైతులు రమణయ్య, లక్కిరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగలించారు. మండలంలో అన్ని గ్రామాలు ఒక ఎత్తయితే, పాయలకుంట్ల గ్రామం దొంగలకు టార్గెట్‌గా మారింది. ఎక్కువగా ఆ గ్రామం ఇళ్లల్లో చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల రైతు ఇంటి వద్ద ఉన్న ఆవును దొంగలు ఆటోలో తీసుకెళ్లారు. అంతేకాక అదే గ్రామంలో నాలుగు గుళ్లల్లో హుండీ దొంగతనం జరిగింది. ఇప్పటికే దాదాపు 20 ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఈ గ్రామంపైన పోలీసు అధికారులు గట్టి నిఘా పెట్టి దొంగలను పట్టుకుంటే తప్ప మరిన్ని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొలానికి నీళ్ల కట్టుకునేందుకు వీలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు, అందులోని రాగివైర్లు, మోటర్ల వద్ద ఉన్న రాగి కేబుల్, స్టాటర్లను దొంగలు ఎత్తుకెళ్లుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు దొంగలను పట్టుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

ఫిజియోథెరపీపై అవగాహన అవసరం



అరుణ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. విధుల్లో భాగంగా రోజులో ఎక్కువ సేపు కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్‌పై పనిచేస్తుంటాడు. దీంతో అతని మెడ, వెన్నులో నొప్పి మొదలైంది. ఆసుపత్రికెళితే మందులిచ్చారు. అయినా ఫలితం లేకపోయింది. కానీ ఫిజియోథెరపీ ద్వారా ఉపశమనం పొందగలిగాడు.

రామారావుకు 50సంవత్సరాలు. ఈ మధ్య మోకాళ్ల నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం మోకాళ్లు యథాస్థానానికి, కీళ్ల కదలికలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడింది.

మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు కూర్చోవడం వంటి కారణాలతో అనేకమంది యువత, పెద్దలు కీళ్లనొప్పులు, వెన్నునొప్పి, మెడనొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు మందులు లేకుండా ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించి, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫిజియోథెరపిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.



నేడు ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవంగా జరుపుకొంటారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం.



సర్వజన ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనంలో ఫిజియోథెరపీ అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. పుట్టుకతో వచ్చే వైకల్యాలు, ప్రమాదాల వల్ల కలిగే గాయాలు, పక్షవాతం, మానసిక ఒత్తిడి వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఫిజియోథెరపీ అద్భుతమైన చికిత్సగా నిలుస్తోంది. వ్యాయామాల ద్వారా, చేతితో చేసే చికిత్సల ద్వారా శారీరక కదలికలను మెరుగుపరిచి, నొప్పిని తగ్గించి, జీవిత నాణ్యతను పెంచడంలో ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తోంది.

పీడియాట్రిక్ ఫిజియోథెరపీ

పిల్లల భవిష్యత్తు కోసం పిల్లల ఆరోగ్యానికి పీడియాట్రిక్ ఫిజియోథెరపీ ఎంతో అవసరం. పుట్టినప్పటి నుంచి వచ్చే కండరాల బలహీనత, శరీర భాగాల కదలికలో సమస్యలు, మెదడు పక్షవాతం వంటి సమస్యలకు ఈ చికిత్స చాలా ఉపయోగపడుతుంది. ఫిజియోథెరపిస్టులు వ్యాయామాల ద్వారా పిల్లలు సాధారణ జీవితం గడపడానికి, స్కూల్‌కు వెళ్లడానికి, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి ఈ చికిత్స దోహదపడుతుంది.


ఫిజియోథెరపీలో మహిళలకు..

గర్భధారణ, ప్రసవం, రుతుక్రమం వంటి సందర్భాల్లో మహిళలు ఎదుర్కొనే శారీరక సమస్యలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలామంది మహిళలు ఈ చికిత్సను ఉపయోగించుకోవడం లేదు. ఫిజియోథెరపీ ద్వారా ఈ సమస్యలను అధిగమించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు. వైద్యులు, ఫిజియోథెరపీ నిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. మందులపై ఆధారపడకుండా ఫిజియోథెరపీ చికిత్సను స్వీకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో..

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఫిజియోథెరపీ విభాగంలో ప్రతిరోజు సుమారు 70 నుంచి 80 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ఫిజియోథెరపీ సంబంధంగా పీడియాట్రిక్స్, జెనియాట్రిక్స్, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్సైస్‌థెరపీ పరికరాలతో విద్యార్థులు, ట్రైనీ డాక్టర్లతో పక్షవాతం, కీళ్లనొప్పులు, పోస్ట్ ఆప్, ఆర్థో సర్జరీస్‌లకు, ఎముకలు, నరాల సంబంధ మరెన్నో వ్యాధులకు ఇక్కడి ఫిజియోథెరపీ విభాగంలో చికిత్స పొందుతున్నారు.

అన్ని వసతులతో అందుబాటులోకి..



ప్రజలు ఇక్కడ ప్రత్యేకంగా ఆర్థో, న్యూరో, కార్డియో, పీడియాట్రిక్స్ సర్జరీస్ భాగాలకు, తదితర విభాగాలకు ఫిజియోథెరపీ చికిత్స చేయడం జరుగుతుంది. ఇక్కడ ప్రత్యేకంగా నూతన లేజర్, యూఆర్ థెరపీ ద్వారా పిల్లల నుంచి పెద్దల వరకు చికిత్స ఇవ్వడం జరుగుతుంది. ఇక్కడ ముగ్గురు ఫిజియోథెరపిస్టులు, 30 మంది ఇంటర్న్స్ ద్వారా చికిత్సలు అందిస్తున్నారు. నూతన పరికరాలతో, ప్రక్రియలతో ఫిజియోథెరపీలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. అన్ని వసతులతో ఫిజియోథెరపీ విభాగం అందుబాటులో ఉంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ సంపత్, ఫిజియోథెరపీ విభాగం హెచ్‌వోడీ, కడప సర్వజన ఆసుపత్రి

అన్నమయ్య జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం



● విద్య, వైద్య, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

● ఆంధ్రజ్యోతితో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్

రాజంపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఉమ్మడి కడప జిల్లా ఉందని, దేశవ్యాప్తంగా 112 జిల్లాలు వెనుకబడి ఉండగా ఉమ్మడి కడప జిల్లాలోని అన్నమయ్య జిల్లా అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని, దీనిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి జిల్లా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నట్లు రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ వెల్లడించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తున్న ఆయన ఆదివారం రాజంపేటలో ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి అడిగిన కొన్ని ప్రశ్నలకు స్పష్టమైన తమ శాఖ విధానాలను వెల్లడించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అభివృద్ధిపరంగా వెనుకబడి ఉన్న 112 జిల్లాలను గుర్తించిందని, వీటిలో ఉమ్మడి కడప జిల్లా ఉండగా అందులో అత్యంత వెనుకబడిన స్థితిలో అన్నమయ్య జిల్లా ఉందని, వీటిని కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాల జాబితాలో గుర్తించి ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సమన్వయపరుస్తూ ఆ పథకాలు పూర్తిగా అమలయ్యేటట్లు వాటి ఫలితాలు ప్రజలకు చేరువయ్యేటట్లు అటు సంక్షేమాన్ని ఇటు అభివృద్ధిని ప్రజలకు చేరవేసి అభివృద్ధి పరచడమే తమ 20 సూత్రాల అమలు కమిటీ బాధ్యత అన్నారు. ఇందులో భాగంగా తాము ఇప్పటికే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల పనితీరుపై పూర్తిస్థాయిలో సమీక్షలు చేశామని తెలిపారు.

అన్నమయ్య జిల్లాలో రెండుసార్లు పర్యటించి కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాల గురించి అధ్యయనం చేశామని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో గత వైసీపీ హయాంలో అన్ని వ్యవస్థలను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. ఏ శాఖ అధికారిని ఆ శాఖ పనిని చేయనివ్వకుండా నిధులను వారికి ఇష్టమొచ్చినట్లు మళ్లించి భారీ ఎత్తున నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయిందన్నారు. అన్ని శాఖలు నిర్వీర్యమై అధికారులు నామమాత్రంగా తయారయ్యారన్నారు. విషయాన్ని తాము గుర్తెరిగి అన్నిశాఖల అధికారులను సమన్వయపరిచి తిరిగి వాటిని గాడిన పెడుతున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో భారీ ఎత్తున భూఆక్రమణలు జరిగాయని, రికార్డులు తారుమారు చేశారని దీనిపై శాఖాపరంగా చర్యలు తీసుకుని సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో పోషకాహారం సక్రమంగా అందని ప్రాంతాలను గుర్తించి వారికి పౌష్టికాహారం అందించడంతో పాటు ఆ ప్రాంతాల్లో విద్య, వైద్య సౌకర్యాలను మెరుగుపరచడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాలు అనేకం గుర్తించామని, జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా వారికి ఇబ్బందులు లేకుండా చేయడానికి పనులు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఇటీవల అత్యంత వెనుకబడ్డ 500 బ్లాకులను గుర్తించామని, ఆ బ్లాకుల్లో ఉమ్మడి కడప జిల్లాలోని చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ప్రాంతాలు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. రాజంపేట ప్రాంతంలో కూడా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తాము ప్రత్యేక నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. పీఎంశ్రీ పథకం కింద అన్నమయ్య జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ విద్యాలయాల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఒకేచోట చదివే సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య, విద్య, పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిపై తిరుపతిలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించి పథకాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఒంటిమిట్ట, గండికోట ప్రాంతాలను ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం చేస్తామని, ఒంటిమిట్ట ఆలయానికి అనుసంధానంగా దేవునికడప, భద్రాచలం, తిరుమల, శ్రీశైలం, చుట్టుపక్కల ఆలయాన్ని అనుసందానం చేసి ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ విజేత కడప జిల్లా జట్టు


ట్రోఫి అందుకున్న కడప జిల్లా జట్టు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సూపర్-7 క్రికెట్ పోటీ విజేతగా కడపజిల్లా జట్టు అవతరించింది. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు 11జట్లు హాజరయ్యాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కడప జట్టు విజేతగా నిలువగా ఎన్టీఆర్‌జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీతోపాటు మెడల్స్‌ను అందజేశారు. యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు శివారెడ్డి, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.

సమాజానికి సంపద సృష్టించి సేవలందించండి


సమావేశంలో పాల్గొన్న సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ద్వారా సంపద సృష్టించి సమాజానికి సేవలందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యువ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో ఎంటర్‌ప్రెన్యూర్ ఆర్గనైజేషన్‌కు చెందిన 45మంది యువ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఇందులో కడప జిల్లాకు చెందిన సింగారెడ్డి కీర్తిచంద్‌రెడ్డి, డాక్టర్ సింగారెడ్డి దివిజ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, యువ పారిశ్రామికవేత్తలు కొత్త రంగాల్లో అడుగుపెట్టి సత్తా చాటాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, వివిధ ప్రాంతాల యువ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఐకాన్‌పై దాడి

● గాలిబండపై గుర్తు తెలియని వ్యక్తి దాష్టీకం

బి.కొత్తకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో ఆదివారం ఓ అపశ్రుతి చోటుచేసుకుంది. సుందరీకరణ పనుల్లో భాగంగా ఇటీవల గాలిబండ పై ఐ లవ్ హార్సిలీహిల్స్ అనే ఆంగ్ల అక్షరాలతో ఓ ఐకాన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జేసీ, సబ్‌కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. అప్పటి నుంచి హిల్స్ పర్యటనకు వచ్చే పర్యాటకులు గాలిబండపైకి వచ్చి ఈ ఐకాన్ వద్ద ఫోటోలు, సెల్ఫీలు దిగడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దీనిపై దాడి చేసి స్వల్పంగా ధ్వంసం చేశారు. ఐ లవ్ హార్సిలీహిల్స్‌లో లవ్ అర్థాన్ని సూచించే ఆకారంపై రాళ్లతో కొట్టడంతో అది దెబ్బతిని ఆకృతిని కోల్పోయింది. గాలిబండ ముఖద్వారంలోనే పోలీస్ అవుట్‌పోస్టు వున్నప్పటికీ సిబ్బంది లేక పోవడంతో ఈ సంఘటన జరిగింది. దీంతో పోలీసు భద్రతలోని డొల్లతనం మరోసారి బయటపడింది. రెగ్యులర్‌గా పోలీస్ సిబ్బంది లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతన్నాయని, ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని 10 పొట్టేళ్లు మృతి


మృతి చెందిన పొట్టేళ్లు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొనడంతో 10 పొట్టేళ్లు మృతి చెందిన ఘటన ఆదివారం తంబళ్లపల్లె మండలం ఎర్రసానిపల్లెలో చోటుచేసుకుంది. ఎర్రసానిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు సుధాకర్ ఆదివారం పొట్టేళ్లను మేత కోసం తన బీడు భూమిలోకి వదిలాడు. పొట్టేళ్లు రోడ్డు దాటుతున్న సమయంలో అతి వేగంగా వచ్చిన ఓ టిప్పర్ వాటిని ఢీకొనడంతో 10 పొట్టేళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో సుధాకర్ తన జీవనాధారం కోల్పోయారు. విషయం తెలుసుకున్న టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి ఫోన్లో పరామర్శించి అండగా ఉంటానని సుధాకర్‌కు హామీ ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, పురుషోత్తం, తదితరులు సుధాకర్‌ను పరామర్శించారు.

ట్రాక్టర్ కిందపడి మహిళ మృతి

చిట్వేలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేకే వడ్డిపల్లెకి చెందిన రాయని శాంతమ్మ(34) ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. శాంతమ్మ మరి కొంతమందితో కలసి కూలీపనుల నిమిత్తం ట్రాక్టర్‌లో ఎగువపల్లికి వెళ్లింది. పని ముగించుకుని తిరిగి స్వగ్రామం వస్తుండగా కె.కందులవారిపల్లె గ్రామంలోకి వచ్చేసరికి అతివేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను స్పీడ్ బ్రేకర్ వచ్చిందని డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో డ్రైవర్ పక్కనే కూర్చొని ఉన్న శాంతమ్మ ట్రాలీకి, ఇంజన్‌కు మధ్యలో పడటంతో ఆమెపై ట్రాలీ ఎక్కింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు కూలీలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలి మరిది సుబ్బరాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేటకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అత్తపై అల్లుడు దాడి

నందలూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేబాక గ్రామ పంచాయతీ మరాటపల్లె గ్రామంలో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. నరసింహారావు అలియాస్ చిన్న భార్య మంజులాబాయి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలకు వెళ్లింది. ఈక్రమంలో వారి ఇద్దరి పిల్లలను తల్లి పద్మావతిబాయి వద్ద ఉంచింది. ఆదివారం పిల్లలను తనతో పంపాలని అత్తతో గొడవకు దిగిన చిన్న కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కారు, బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడికి గాయాలైనట్లు ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు. ఆదివారం బీకేపల్లెకు చెందిన లియాఖత్ అలీ (64) తన భార్యతో కలిసి బైక్‌పై మదనపల్లెకు వస్తుండగా, అన్నమయ్య సర్కిల్ వద్ద కర్ణాటకకు చెందిన కారు తిరుపతి వైపు వెళ్తూ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి, వెంటనే స్థానికులు ఆస్పత్రి తరలించారు.

పనులు పూర్తి - బిల్లులు నాస్తి

మినీ గోకులాలకు, నీటితొట్లకు అందని బిల్లులు ● బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురు చూపు

అప్పుల భారం భరించలేమంటూ ఆవేదన ● బిల్లులు వెంటనే విడుదల చేయాలని వేడుకోలు



తిమ్మిరెడ్డిపల్లెలో పూర్తయిన సిమెంట్ రోడ్డు నిర్మాణం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'అధికారం చేపట్టాక గ్రామాల్లో సైతం అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని' అధికారులు ప్రకటనలు గుప్పించారు. అంతేకాకుండా పల్లె పండుగ పేరుతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు వెంటనే రూ.4.45 కోట్లు మంజూరు చేసింది. దీంతో వివిధ గ్రామాల్లో సిమెంట్ రోడ్డు, బీటీ రోడ్ల నిర్మాణాలను చేపట్టి పనులను వెనువెంటనే పూర్తి చేశారు. అయితే సుమారు పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు అయిన పనులకు బిల్లులు మంజూరు కాలేదని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో పనులను వేగంగా చేపట్టి పూర్తి చేస్తే బిల్లులు కూడా త్వరగా వస్తాయని గ్రామాల్లో సీసీ రోడ్లు ఇతర పనులను పూర్తి చేశారు. పూర్తి అయిన పనులను కూటమి ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాలను సైతం చేసేశారు. అయినా ఇంతవరకూ బిల్లులు రాలేదని వారు వాపోతున్నారు. వివరాల్లోకెళితే...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సాగాయి. గ్రామాల్లో సిమెంట్ రోడ్డు, పశువులకు నీటి తొట్లు, తదితర నిర్మాణాలు చేపట్టి పనులను పూర్తి చేశారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో తెచ్చిన సొమ్ముకు వడ్డీలు చెల్లించలేక పోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 2.50 కోట్లతో సిమెంట్ రోడ్డు...

తుమ్మరకుంట గ్రామం తిమ్మిరెడ్డిపల్లె, బూర్లపల్లె, పోతుపేట, మద్దయ్యగారిపల్లె, కందుకూరు, పట్టెంవాండ్లపల్లె, పీటీఎం మోడల్ స్కూల్ తదితర చోట్ల 55 సిమెంట్ రోడ్లు మంజూరు కాగా కొన్ని చోట్ల సిమెంట్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేశారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల క్వాలిటీ కంట్రోల్ తనిఖీ సైతం పూర్తి చేసి రికార్డులను పూర్తి చేసినా ఇప్పటి వరకూ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అల్లాడి పోతున్నారు.

మినీ గోకులాలకూ అందని బిల్లులు

మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు తమ పశువుల సౌకర్యార్థం 48 మినీ గోకులం షెడ్డు నిర్మాణాలను చేపట్టారు. అయితే రైతులు అప్పు చేసి నిర్మాణాలు పూర్తి చేసి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకూ వాటికి బిల్లులు మంజూరు కాలేదు. అయితే ఇటీవల 38 మినీ గోకులం షెడ్డులకు ఒక బిల్లు మాత్రం పడిందని, ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు టార్గెట్లపై చూపిన శ్రద్ధ బిల్లులు మంజూరు చేయించడంలో చూపడం లేదని పాడి రైతులు విమర్శిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని వివిధ గ్రామాల్లో 55 సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు రూ. 2.50 కోట్లు ప్రభుత్వం నిధులతో పనులు ప్రారంభించి 80 శాతం పనులను పూర్తి చేశాం. పూర్తి అయిన పనులకు ఎఫ్‌టీఓలు సిద్ధం చేసిన బిల్లుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం నిధులను విడుదల చేస్తే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

రాజేంద్ర, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జ్ జేఈ





రంగసముద్రంలో నిర్మాణం పూర్తయిన నీటి తొట్టె - బూర్లపల్లెలో నిర్మాణం పూర్తైన మినీ గోకులం షెడ్డు

వైభవంగా వినాయక నిమజ్జనం

● రూ.2 లక్షలు పలికిన లడ్డూ



అయ్యవారిపల్లెలో లడ్డూ సొంతం చేసుకున్న భక్తులు

వాల్మీకిపురం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అయ్యవారిపల్లెలో ఆదివారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వినాయక మండపం చెంత నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పోటాపోటీగా కొనసాగింది. వీరంరెడ్డిగారి సౌజన్య కుమార్‌రెడ్డి కుటుంబీకులు రూ.2లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి వినాయక ప్రతిమను వాహనంపై అధిష్టింప చేశారు. ప్రజలు, యువత, చిన్నారులు, మహిళలు పాల్గొనగా బళ్లారి వాయిద్యాలు, భారీ బాణసంచా నడుమ గ్రామోత్సవం నిర్వహించి వినాయక ప్రతిమను సమీప చెరువు ప్రాంతంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రి, ఉత్సవ కమిటీ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలి'



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీపీపీ విధానంతో మెడికల్ కాలేజీ నిర్వహిస్తే పేదలకు సరైన వైద్యం అందదని, పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ కోర్సు అందుబాటులోకి రాదన్నారు. కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ పీపీపీ విధానం అంతా బూటకమన్నారు. బహుజన సేన అధ్యక్షుడు శ్రీచందు, యూటీఎఫ్ నేత పురం వెంకటరమణ, విశ్రాంత ఎంఈఓ రెడ్డెప్ప, న్యాయవాది సోమశేఖర్, విశ్రాంత ఉద్యోగులు ఉత్తన్న, నాగరాజు, జన విజ్ఞాన వేదిక హరీంద్రనాథ్‌శర్మ, ఏఐఎస్ఎఫ్ మాధవ్ పాల్గొన్నారు.

ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించం



ఆలయం వద్ద పోలీసులు, భక్తులు

పీలేరు రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఒడిలో కొలువుతీరిన సంతాన ప్రదాత మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించమని పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలపై ఆదివారం ఆలయం వద్ద పీలేరు పోలీస్, ప్రజలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పలు ప్రాంతాల భక్తులు వస్తుంటారని, అయితే ఇక్కడ కొందరు ఆకతాయిలు చేస్తున్న అసాంఘిక కార్యక్రమాలతో సమస్యలు ఉత్పనమౌతున్నాయన్నారు. ఇకపై ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో పీలేరు ఎస్ఐ లోకేష్, స్థానిక నేతలు మురళీధర్, హరిబాబు, దామోదర్ రెడ్డి, భగత్, హరిక్రిష్ణ, హరినాథ్, రాజారెడ్డి, విశ్వనాథ్, మల్లికార్జున, సునీల్ రెడ్డి, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు



పౌర్ణమి పూలందుకుంటున్న కార్యసిద్ధి అభయాంజనేయస్వామి

వాల్మీకిపురం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. ధర్మపథం సమూహాలయంలో ఆదివారం ఉదయం మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అశేష భక్తజనం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం, కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి నిండు పౌర్ణమి వెలుగులో ఆకుపూజ, సింధూర పూజ, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మిట్స్‌కు అరుదైన గుర్తింపు



గుర్తింపు సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న వీసీ యువరాజ్ తదితరులు

కురబలకోట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కినట్లు వీసీ సి.యువరాజ్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో కేంద్రవిద్యాశాఖ అత్యుత్తమ విద్యాకేంద్రాల జాబితాను ప్రకటించింది. కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు, నాణ్యమైన బోధన, అభ్యసనం, మూల్యాంకనం, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పరిశోధనలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితర సదుపాయాలను పరిగణలోకి తీసుకుని 13 విభాగాల్లో ర్యాంకులను ప్రకటించింది. 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) మిట్స్‌కు 201 నుంచి 300మధ్యలో గుర్తింపును దక్కించుకున్నది. ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపుతో మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింత ఎక్కువ కల్పిస్తామన్నారు. కళాశాలకు ఈ ఏడాది నుంచి యూనివర్సిటీ స్థాయి వచ్చిందన్నారు. అరుదైన గుర్తింపుపై వర్సిటీ చాన్సెలర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, వీసీ యువరాజ్, రిజిస్ట్రార్ ప్రదీప్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీని 30 పడకలకు పెంచాలని మంత్రికి వినతి

పెద్దతిప్పసముద్రం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు పీటీఎం బీజేపీ నేతలు విన్నవించారు. నియోజకవర్గంలోనే అత్యంత వెనుక బడిన మండలమని, ప్రభుత్వ వైద్యశాల ప్రజలకు అందుబాటులో లేదని, పీహెచ్‌సీ ఉదయం నుంచీ సాయంత్రం 4 వరకు మాత్రమే పని చేస్తుందన్నారు. మారుమూల ప్రాంతమవడంతో ప్రైవేటు ఆస్పత్రులు కూడా అందుబాటులో లేకపోవడంతో రాత్రిళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వివరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పెద్దతిప్ప సముద్రం పీహెచ్‌సీ స్థాయిని పెంచితే మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆస్పత్రిని రాత్రి వేళ కూడా అందుబాటులో ఉంచితే గ్రామీణులకు ఉపయోగంగా ఉంటుందని విన్నవించారు. మండల బీజేపీ నేతలు ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ పూల నాగరాజు, మల్లెం శివయ్య, కార్యం శంకర, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, మద్దిరెడ్డి, గౌండర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత



ములకలచెరువులో మూతపడిన ఆలయం

మదనపల్లెఅర్బన్/పీలేరురూరల్/ములకలచెరువు/కలికిరి,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం పురస్కరించుకుని పట్టణంలో ఆలయాలు మూతపడ్డాయి. ఆదివారం రాత్రి 9.50 నిముషాలకు గ్రహణ స్పర్శ కాలం మొదలవుతుంది. 11.41 నిముషాలకు గ్రహణ మధ్యకాలం, రాత్రి 12.24కు గ్రహణం నిండి ఉండడం, 1.31కు మోక్ష కాలం, 3.41కు ఆద్యంత పుణ్య కాలం అని పండితులు వివరించారు. సంపూర్ణ చంద్ర గ్రహణం ఉండడంతో ఆలయాలు మూతవేశారు. సోమవారం ఉదయం ఆలయం సంప్రోక్షణ జరిగి ఆలయాన్ని శుద్ధి చేసి భక్తులకు స్వాముల వారిని దర్శనం కల్పిస్తారు. స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి, చిప్పిలిలో యోగ భోగేశ్వరస్వామి, కనుమలో గంగమ్మ ఆలయాలు మూసివేసినట్లు గ్రూప్ టెంపుల్ ఈఓ రమణ ప్రకటించారు. సోమేశ్వరస్వామి, సొసైటీ కాలనీ రామాలయం, కోర్టులో గంగమ్మ, నీరుగట్టువారిపల్లె చౌడేశ్వ రీదేవి, సీటీఎం రోడ్డు మంజునాథ స్వామి, బర్మా వీధిలో షిర్డిసాయి బాబా ఆలయాలు మూతవేశారు.

● పీలేరులో పలు ఆలయాలను మూసివేశారు. గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ, షిరిడీ సాయి నాథ్, కోట పల్లె జీ.వీ. చంద్రశేఖర్ నగర్, కడప మార్గంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు, సదుం మార్గంలోని సీతారాముల ఆలయం, మదనపల్లె మార్గంలోని చెన్నకేశవ స్వామి ఆలయాలను మూసివేశారు.

● ములకలచెరువు కన్యకాపరమేశ్వరిదేవి, ఆంజనేయస్వామి, వినాయక ఆలయాలు, బురకాయలకోటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కదిరినాధునికోట పంచాయ తీలోని కనుగొండరాయస్వామి ఆలయాలు మూత పడ్డాయి.

● కలికిరిలో పురాతన యల్లమ్మ తల్లి ఆలయాన్ని మూసివేశారు. దీంతో ఆదివారం దర్శనాలకు విరామమిచ్చారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ, ఆలయ శుద్ధి తరువాత అమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు.



మూతపడిన మదనపల్లె దేవళంవీధిలో ప్రసన్న వేంకటరమణ స్వామి - పీలేరులో వేంకటేశ్వర స్వామి ఆలయం

విద్యాభివృద్ధి కృషి చేయాలి



మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం అందిస్తున్న మనోహర్

పెద్దమండ్యం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుక్కే మనోహర్ కోరారు. ఆదివారం విజయవాడలో ఆయన మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో కొత్తగా హార్టికల్చరర్, అగ్రికల్చర్ డిప్లొమా, డిగ్రీ కాలేజీలు మంజూరు చేయాలని కోరారు. మండలంలో స్పోర్ట్స్ స్కూల్, గిరిజన కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో గిరిజన నేతలు పాల్గొన్నారు.

నేరాలను నియంత్రిస్తాం

గుర్రంకొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నేరాలు నియంత్రణకు పోలీసులు కృషి చేస్తున్నామని ఎస్ఐ రఘురాం తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో చోరీలు, ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటిస్తున్నట్లు చెప్పారు. రాత్రిళ్ల గస్తీ పెంచి నేరాలను నియంత్రిస్తామన్నారు. కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు.

నేడు కలికిరికి మాజీ సీఎం రాక

కలికిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, బీజేపీ నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం.కృష్ణప్ప చెప్పారు. హైదారాబాదు నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చి అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాత్రి 7.30 గంటలకు కలికిరి చేరుకోనున్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన అందుబాటులో వుంటారు. అనంతరం తిరిగి బుధవారం ఉదయం 9.45కు కలికిరిలో బయలుదేరి తిరుపతి వెళ్లనున్నారు. అక్కడి నుంచి హైదరాబాదు వెళతారని కృష్ణప్ప వివరించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో వున్న వారిని ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు నిధులు ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాష పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె మండలం, పట్టణంలోని 25 మందికి రూ.15 లక్షల మేరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కోళ్లబైలు టీడీపీ ఇన్‌చార్జి రాటకొండ శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తలారి రాధ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది



ఎరుకలప్ప కుటుంబీకులను పరామర్శించిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు పార్టీ అండగా వుంటుందని తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. ఇటీవల మృతి చెందిన మండల టీడీపీ నేత, విశ్రాంత టీచర్ పుల్లగూర ఎరుకలప్ప కుటుంబ సభ్యులు పుల్లగూర సతీష్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ, పుల్లగూర రాజేష్‌కుమార్‌ని పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు హసీంసాబ్, తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర, మాజీ ఎంపీపీ రజనీదత్, టీసీ సంఘ నేత మేకల చలపతి, మహేశ్వర, ప్రభాకరరెడ్డి, గల్లా నారాయణ, చంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఆర్పీఎస్ నేత ఇంటికి మంత్రి



మంత్రి సత్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నరేంద్రబాబు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పర్యటనలో భాగంగా శనివారం రాత్రి మంత్రి సత్యకుమార్ యాదవ్ పట్టణంలో ఎంఆర్పీఎస్ నేత నరేంద్రబాబు ఇంటికి విచ్చేశారు. నరేంద్ర కుటుంబ సభ్యులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఎమార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగతో ఫోన్ ద్వారా యోగక్షేమాలను మంత్రి వాకబు చేశారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపల్లె ప్రశాంత్, నేతలు వరదారెడ్డి నారదరెడ్డి, బండి ఆనంద్, భగవాన్, ఎమార్పీఎస్ నేతలు వాసు, మనోహర్, రాజేష్, తిరుపాల్, ప్రతాప్, భవానీ, వెంకటేశ్, గంగాధర్, రాములమ్మ, హరి, సుబ్బ పాల్గొన్నారు.

రోగులపై ఆస్పత్రి సిబ్బంది చిందులు

సిద్దవటం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దవాఖానాలో ఆదివారం ఓపీ రాసేందుకు కూడా దిక్కులేకుండా పోయింది. పైగా సిబ్బంది చిందులు వేయడంతో వారు మహిళా డాక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలో వైరల్ జ్వరాలు పెరిగిపోయాయి. దీంతో రోజూ ప్రభుత్వ ఆస్పత్రికి 250 మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు. ఆదివారం రోగులతో సిబ్బంది విచక్షణ కోల్పోయి మాట్లాడటంపై అసహనం వ్యక్తమవుతోంది.

రాష్ట్రపతికి కార్డులు పోస్ట్



రాష్ట్రపతికి పోస్టుకార్డులు పంపుతున్న రెడ్డిసాహెబ్, తదితరులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆదివారం ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ ఆధ్వర్యంలో పోస్టు కార్డులను నియోజకవర్గ నేత రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి పోస్ట్ చేశారు. ఈసీతో కలిసి కేంద్ర ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని, దేశవ్యాప్తంగా ప్రజలు తెలిసిపోయిందన్నారు. ఈసీ చిత్తశుద్ధి ఎక్కడా నిరూపించుకోలేక పోయిందన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సంపత్, రాష్ట్ర కార్యదర్శి తేజా, నేతలు మహమ్మద్ అలీ, విద్యార్థి సంఘ నేతలు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలున్న రైతులకే యూరియా

నిమ్మనపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): భూమి పట్టాదారు పుస్తకం, ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులకే యూరియాను పంపిణీ చేస్తామని ఏఓ మంజుల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ మండలంలో యూరియా కొరత లేదని కొందరు రైతులు అవసరానికి కంటే ఎక్కువ కొనుగోలు చేస్తున్నారన్నారు. సోమవారం రెడ్డివారిపల్లి, కొండయ్యగారిపల్లి పంచాయతుల్లో 19.9మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలిపారు. రెడ్డివారిపల్లి లో 220 బస్తాలు, కొండయ్యగారిపల్లిలో 220బస్తాలను రైతులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఎరువుల విక్రయాల్లో దుకాణదారులు సంబంధిత అధికారులకు తెలిపితే దుకాణాల వద్ద తమ సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల వద్ద అవసరానికి మించి యూరియా బస్తాలు వున్నా సీజ్ చేస్తామన్నారు.

ప్రశ్నార్థకంగా తారురోడ్ల నిర్మాణం



తారురోడ్డుకు నోచుకోని పోతువారిపల్లె రోడ్డు, షేర్‌ఖాన్‌వడ్డిపల్లెకు మట్టి రోడ్డు

కలకడ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయత్ రాజ్ పథకంపై మండలంలో ప్రారంభమైన పలు తారురోడ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగా మారాయి. దశాబ్ధాల కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో వివిధ గ్రామాలకు తారురోడ్లు సౌకర్యం కల్పించాలని అప్పట్లో నిధుల మంజూరు చేసినట్లు తెలిసింది. దీంతో కొన్ని చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి షేర్‌ఖాన్‌వడ్డిపల్లె వరకు 1.3 కిలోమీటర్లకు రూ.48 లక్షలు, పోతువారిపల్లెకు 1.2కిలోమీటర్ల దూరానికి రూ.40 లక్షలతో నిధుల మంజూరైన వాటిలో ఉన్నాయి. రాష్ట్ర విభజన జరగడంతో నిధుల విడుదలకు బ్రేక్‌పడి అర్థంతరంగా నిలిచిపోయాయి. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పనుల ఊసెత్తక పోవడం దారుణమని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారణంగా దెబ్బతిన్న మట్టి రోడ్ల గుండా ప్రయాణం రాకపోకలకు కష్టమవు తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి త్వరితిగతిన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.